కథ

# న్యాయం కన్నీళ్ళు

సి.హెచ్.మధు

**వాడు ఇంకా ఆశతో వున్నాడు తననెవరైనా రక్షిస్తారని....**

**తనను ఈ జైలు గోడల నుండి విముక్తి చేయటానికి ఏ దేవుడైనా దిగి వస్తాడని..**

**వాడికి ఆశ చచ్చిపోలేదు...**

**తాను బయట ప్రపంచంలోకి వస్తానని-**

**వాడు విశ్వాసంతోనే వున్నాడు**

**ఏ దేవుడైనా తనగోడు వినటానికి వస్తాడని-**



★ ★ ★

**వాడి వయస్సు 12 సంవత్సరాలు. ఇంకా పన్నెండు దాటలేదు.**

**వాడు నెల రోజులుగా నిజామాబాద్ బాల నేరస్తుల జైలులో వుంటున్నాడు.**

వాడికి జైలు నరకంగా వుంది... ఏమి చేయగలడు? ప్రపంచం వాడికి తెలియదు. ఇంకా బాల్యం దాటని వయస్సు.

చిరిగిపోయిన చొక్కా చింపిరి జుట్టు మోకాళ్ళ వరకు లాగు, లోతులు పోయిన కళ్ళు బొక్కలు తేలిన శరీరం.

వాడు ఎన్నిసార్లు ఆ జైలులో ఎన్ని కన్నీళ్లు గార్చాడో ఎంత వెక్కివెక్కి ఏడ్చాడో ఎంత దిగులుతో బ్రతికాడో, ఎంత బెంగతో నిరాశామయ చీకట్లోకి ఎన్ని రాత్రులు నిశ్శబ్ధంగా చూచాడో, ఎన్ని చీకటి రాత్రులు నిద్రేకుండా గడిపాడో- స్వయంగా అనుభవం వృన్న 'కవి' అయితే చక్కగా చెప్పగలడు.

★ ★ ★

వాణ్ని చూచి వాని కథ ని కొన్ని రాత్రులు నిద్రరాక, నిద్రపోక ఇదేం వ్యవస్థరా బాబు అని తిట్టుకొని, మండిపడి ఏమీ చేయలేక నిరాశతో ఓ కథ అయినా రాద్దామని వాడి కథ వ్రాయటం. కవితాత్మ కలిగిన 'కవి' మాత్రం వాడి దుఃఖం వచ్చేలా వ్రాయగలడు. నేను కథకున్ని.

★ ★ ★

వాడు నిజామాబాద్ బస్టాండులో ఓ రాత్రి- ఒకరి జేబులోని పర్సుని దొంగిలించాడని, ఆ పర్సులో ఐదువేల రూపాయలున్నాయని, బస్ స్టాండులో పడుకొన్న వాన్ని లేపి తన్ని- జైలులో కుక్కి లాఠీలతో కొట్టారు.

ఐదువేలు వాడి దగ్గర దొరకలేదు.

వాడి మీద కేసు ఫైలు చేసారు.

కోర్టుకు తీసుకెళ్ళారు.

న్యాయమూర్తి ముందు నిలబెట్టారు.

వానికింకా పన్నెండేళ్ళు దాటలేదు.

న్యాయమూర్తి జైలుకు పంపాడు. తీర్పురాలేదు దొంగజైలులో వుండాలిగా... పన్నెండేళ్ళు దాటకపోతేనేం! పాతిక ఏళ్ళు దాటితేనేం. దొంగజైలులో వుండాలిగా....

వాడు ఎంతకొట్టినా, ఎన్ని తన్నినా, ఎన్ని చిత్రహింసలు చేసినా బస్టాండ్‌లో, లాకప్‌రూమ్‌లో, న్యాయమూర్తి ముందు ఒకేమాట అన్నాడు 'నేను దొంగతనం చేయలేదు', 'పర్సుతీయలేదు'

వాడు కనిపిస్తుందే దొంగలాగా.... ఆకలి కడుపు, గరీబు బట్టలు, ఎండిపోయిన బుగ్గలు, కందిపోయిన పెదవులు, చెప్పులు లేని కాళ్ళు... వీళ్ళుకాకపోతే ఆ వ్యవస్థలో దొంగలెవరు? కడుపుకు లేని వాళ్ళే దొంగలు, బీదోళ్లే దొంగలు. వాడు దొంగతనం చేసినా చేయకున్నా వాడు దొంగే! వాడు నిప్పులా వున్నా బొగ్గే అంటారు. లేకపోతే ఆ నిప్పు గాలుతుంది. అంటిస్తుంది. నిప్పులు రేపుతుంది. మొత్తం బూడిద చేస్తుంది. బీదవాడి కోపం అలాంటిది ఆ నిప్పుమీద నీళ్ళు పోయాలంటే వాడ్ని దొంగని చేయాలి వాడు దొంగయ్యాడు.

ఈ వ్యవస్థలో పోలీసులు చెప్పిందే వేదం. వాళ్ళు తెచ్చిందే సాక్ష్యం. నేరస్తులను నిర్ధారించటానికి కోర్టుకు పోలేసులే ఆధారం. చట్టం పోలీసులకు ఆ బాధ్యత అప్పగించింది. ఈ సమాజాన్ని ప్రజలను, రక్షించేది పోలీసులేనని చట్టం చెపుతుంది. పోలీసులు ఎవర్ని రక్షిస్తున్నారో, ఎవర్ని శిక్షిస్తున్నారో ఈనాడు జగమందరికీ తెల్సు.

ఈ కాలంలో పన్నెండేళ్ళు దాటని వాడు దొంగయ్యాడు.

★ ★ ★

వాడిపేరు కిట్టిగాడు. వాన్ని మొదటి సారి – మొదటిసారేమిటీ?– ఒకే ఒకసారి వాడ్ని కోర్టులో చూచాను. పన్నెండేళ్ళు దాటని పిల్లోడు ఎంత వుంటాడు! చిన్న గుంటాడు. వాన్ని కోర్టులో ఇద్దరు పోలీసులు న్యాయమూర్తి ముందు ప్రవేశపెడుతుండగా చూచాను. అమాయక చూపులు, భయం భయంగా చూపులు, లోతుకుపోయిన

కళ్ళు, ఎండిపోయిన శరీరం కొన్ని రోజులు నీళ్ళు పోయకుంటే వాడిపోయిన మొక్కలా వున్నాడు వాడు.

నా ప్రక్కనున్న నా మిత్రుడు న్యాయవాది శంకర్రావ్ నడిగాను. నాయ్యవాదులలో ఇప్పటికీ కొందరు మంచివాళ్ళున్నారు. న్యాయవాది వృత్తిని వ్యాపారం చేయని వాళ్ళున్నారు. సామాజిక చింతన, నేరస్థులను చూచి అయ్యోపాపం అనేవాళ్ళున్నారు. అటువంటి వారిలో శంకర్రావ్ ఒకరు.

ఆయన దొంగ కిట్టిగాడి గూర్చి చెప్పాడు.

★ ★ ★

కిట్టిగాడు 'దొంగ' ఎలా అయ్యాడు?–

★ ★ ★

న్యాయవాది శంకర్రావ్ చెప్పిన వివరాల చిట్టా...

కిట్టిగాడిది మంచిర్యాల. మంచిర్యాల అంటే బొగ్గుగనులున్న మంచిర్యాల. తెలంగాణా సంపదవున్న మంచిర్యాల కిట్టిగాడి తల్లి తండ్రులు కూలీ పని చేసుకొని బ్రతుకుతూ చిన్న గుడిసెలో వుంటారు. కష్టపడితే నూకలు లేకపోతే ఎండడం అనే పద్ధతిలో వుంటుంది వారి బ్రతుకు. నల్ల బంగారం వున్న దగ్గర కూడా ఇటువంటి వారున్నారా? అనే అనుమానం రావచ్చు. హైద్రాబాద్‌లోని హైటెక్‌సిటీని చూచి చప్పట్లు కొట్టేవారికి ఇటువంటి వారు కనిపించరు. టీవీలో కలర్లు, సెల్‌ఫోన్ గంటలు, ఇంటర్నెట్ మ్యూజిక్‌లు వినే వారికి దారిద్ర్యమే లేదనుకుంటారు. కానీ అయ్యో బాబోయ్! కోట్లసంఖ్యలో ఇటువంటి వారుంటారు. దేశం నలుమూలలలో కనిపిస్తారు. హైటెక్‌సిటీ ఆమడ దూరంలోనే వుంటారు. మన కనులు వారిని చూడటానికి ఇచ్ఛగించవు. పారిపోతాయి, పరుగులు తీస్తాయి మనం టీవీలలో 'వున్నవాళ్ళ' కథలు సీరియల్స్ చూస్తాం. లేని వాళ్ళ కథలొస్తే చూడాలా? చిరాకెత్తుతుంది. అందుకే అసలు వాస్తవాలనుండి తప్పించుకుంటాం. తప్పిస్తున్నారేమో మనసు! రంగు రంగుల ప్రపంచాన్ని మనముందు పెట్టి వాస్తవ ప్రపంచాన్ని హైజాక్ చేస్తున్నారు.

వాస్తవ ప్రపంచంలో కిట్టిగాడి కుటుంబం ఒకటి. కిట్టిగాడి తల్లిదండ్రులకు ఇద్దరూ కొడుకులే! కిట్టిగాడు చిన్నోడు.

పెద్దోడు ఏదో హోటలులో 'చిప్పలు' కడుగుతుంటాడు. ఈ వాక్యం చూచి ఇంకా అందంగా వ్రాయచ్చుగా అని కథ చదివేవాళ్ళు చిరాకుపడుతారు. కానీ కొంచెం మంచి హోటళ్ళో పనిచేసే వారిని ఏమంటారు. వాడు వీడు ఏమిరా అంటారు. నిజానికి చిన్న హోటళ్ళలో పనిచేసే పిల్లలు తిడితే ఎదురు మాట్లాడకూడదు. తంతే ఎవరికి చెప్పుకోకూడదు శ్రీశ్రీ తన కవితలో ప్రశ్నించి, ప్రశ్నించి, ప్రశ్నించి ఇక్కడి వరకొచ్చాం. ప్రశ్నలకు ఏదీ మారలేదు. మనం ప్రశ్నిస్తే జవాబు చెప్పేవారు మొద్దుబారిపోయారు.

ఇది పెద్దోడి కథ కాదు. చిన్నోడు కిట్టిగాడి కథ.

పెద్దోడు హోటళ్ళో చిప్పలు కడుగుతున్నాడు చిన్నోణ్నైనా చదివిద్దామని సర్కారు స్కూలులో చేర్పించారు.



వాడు ఆరవ తరగతి చదువుతున్న సమయం,

సర్కారు స్కూలు అయినంత మాత్రాన పుస్తకాలు పెన్సిళ్ళు ఇవ్వరుగా! ఇవ్వాలని వున్నా యివ్వరుగా! అవి బడ్జెట్‌దాటి రావుగా! అవి కోటలు దాటి రావటానికి కోట్లరూపాయలు యవ్వారం కాదుగా! బడ్జెట్ అంతా అంకెల గారడి. అదో చదరంగం. పెద్దపాములు బడ్జెట్‌ను మింగేస్తాయి.

ప్రాణం పోతున్నా సర్కారు దవాఖానాలలో మందులివ్వరు. మందులు దొరకవు. మందులు విడుదలయినట్టు, వచ్చినట్టు, చేరినట్టు, యిచ్చినట్టు అన్నీ లెక్కలుంటాయి. లెక్కలలో వుంటాయి. మందులు రోగికివ్వరు. వాడి ప్రాణం నిలువదు అంతా దేవుని దయ. డాక్టర్లు, నర్సులు, సిబ్బంది ప్రాణం పోయిన రోగి బంధువులు అంతా దేవుని దయతో సర్దుకుపోవాల్సిందే.

ప్రాణం పోతున్న రోగికే సర్కారు ఆసుపత్రిలో సర్కారు మందులందనపుడు- సర్కారు స్కూళ్ళలో మునిగి పోయేదేమీ లేనపుడు బీదోడు చదివి ఎవడ్ని వుద్ధరిస్తాడనే భావన వున్నప్పుడు కిట్టిగాడికి పుస్తకాలు, పెన్సిళ్ళు ఎక్కడందుతాయి? అందలేదు.

తండ్రి 'కొనిస్తా కొనిస్తా' అంటూ మూడు మాసాలు గడిపాడు. దినమంతా ఆలుమగలు కష్టపడితే, పెద్దకొడుకు చిప్పలు కడిగితే వచ్చే పైసలు దొడ్డు బియ్యానికి, సర్కారు రేషన్ బియ్యానికి చాలనప్పుడు ఏం కొనిస్తాడు?

అలా మూడు నెలలు గడిచింది. కిట్టిగాడి చదువు వెనక్కుపట్టింది.

కొందరు టీచర్లుంటారు చెప్పేది తక్కువ కొట్టేది ఎక్కువ. సబ్జెక్ట్ పైన ధ్యాస వుండదు. 'వెటకారం' మీద మక్కువ ఎక్కువ. పిల్లల దగ్గర పుస్తకాలు లేకపోతే - వాళ్ళు కొనకపోతే కొట్టి నిలబెట్టి నానా యాగీ చేస్తారు.

అటువంటి టీచర్ మహానుభావుడొకరు, (ఇందులో వెటకారం లేదు. మన గురువు గారందాం! గురువులు గురువులేగా! ద్రోణాచార్యుల శిష్యులు వీరత్వం తక్కువ డంభాచారం ఎక్కువ) కిట్టిగాడ్ని పుస్తకాల కొరకు వేధించటం మొదలెట్టాడు.

పుస్తకాల కొరకు పంతులు తిడతాడు కొడతాడు ఎండలోనిలబెడతాడు.

తండ్రి-

ఇదిగో అదిగో రేపు ఎల్లుండి అంటూ కొనివ్వడం. బడికి పోకపోతే తండ్రి తంతాడు. బడికి పోతే గురువుకొడతాడు.

కిట్టిగాడి నెలరోజులు మానసిక నరకం అనుభవించి ఎక్కడైనా పారిపోదామని- రైలులో టిక్కెట్టు లేకుండా హైదరాబాద్ వచ్చి అక్కడి నుండి నిజామాబాద్ వచ్చి- తెల్లవారి ఏదైనా హోటలులో పని చూచుకుందామనుకొని ఉదయం నుండి ఏమీ తిననివాడు రాత్రి నిజామాబాద్ బస్టాండ్‌లో నిద్రపోయాడు.

అది వాడు చేసిన తప్పు..

దొంగయ్యాడు

★★★

ఆ రోజు రాత్రి పన్నెండుగంటల సమయాన హైదరాబాద్ వెళ్ళే ఒక ప్రయాణీకుడు తన జేబులో పర్సుపోయిందని- అందులో ఐదువేలు వున్నాయని- అన్నీ వెయ్యి రూపాయల నోట్లని నానా హంగామా చేసాడు. వాడి పర్సుపోయిన మాట నిజమే! ఎలా పోయాయో ఎవరు కొట్టేసారో- పక్కనుంచుదాం. బస్టాండ్‌లో డ్యూటీ పోలీసులుంటారు. రాత్రి అంతా ప్రయాణీకులు వచ్చిపోయే బస్టాండులో-బస్సులు అటూ ఇటూ తిరిగే బస్‌స్టాండ్‌లో 'రక్షణ'కు పోలీసు లేకపోతే ఎలా? వున్నాడు. వుంటాడు ఇటువంటివి జరిగినప్పుడు వూడిపడుతాడు. ఈ వ్యవస్థలో 'నేరం' జరుగకుండా చూడటం పోలీసు విధికాదు కాకుండా పోయింది. నేరం జరిగిన తర్వాత ప్రత్యక్ష్యమవుతారు. నేరం జరిగిన తర్వాత నేరస్థున్ని పట్టుకోవాలి! అది వారి బాధ్యత లేకపోతే కొందరు నిలదీస్తారు. నిలదీసేవాళ్ళున్నారు. అందు కొరుకు పోలీసులు కొంత వెదికి, పరిశోధించి, నటించి నేరస్థుల్ని పట్టుకుంటారు. నేరస్థున్ని చూపించాలిగా! చూపించటానికి పట్టుకుంటారు. వాడేనా నేరస్థుడు? అని అడుగొద్దు నీవు నేరస్తునివవుతావు! అడిగిన వాడు నేరస్థుడవుతాడు. నేరస్థుడు దొరికాడనే తృప్తి చట్టంకుంటుంది. నేరస్థుడ్ని పట్టుకొన్నారనే కీర్తి పోలీసుల కొస్తుంది. పర్వాలేదు నిద్రపోవచ్చని ప్రజలనుకుంటారు. పోలీసులు పట్టుకొన్నది అసలైన నేరస్థుడేనా? అసలు నకలు తెల్సినా చెప్పలేం.

లోతుకెళ్ళద్దు.

ప్రమాదాలుంటాయి.

మొసళ్ళు మింగేస్తాయి.

మనకెందుకూ?

పండితుడు చెప్పింది భాష. బ్రాహ్మణుడు చెప్పింది శుభముహూర్తం. స్వామి చెప్పింది వేదం గురువు చెప్పింది విద్య.

పోలీసు 'దొంగ' అంటే 'దొంగ' అందాం.

పోలీసు 'హంత కుడు' అంటే హంతకుడందాం! వాడికి రక్తం అంటిందా లేదా? మనం చూడొచ్చామా?- అసలు చూడగలమా? చట్టం కోటలు దాటి లోనికెలా వెళ్ళగలం?

పోలీసు ఎన్‌కౌంటరంటే ఎన్‌కౌంటరందాం! వివాదాలెందుకూ? బ్రతగాలి మనం! మన్ను తిన్న పాములా బ్రతుగాలి.

ఐదువేలున్న పర్సు దొంగతనం జరిగిందనే బాధితుని హంగామాతో రంగప్రవేశం చేసిన డ్యూటీ పోలీసు అటు తిరిగి ఇటు తిరిగి వాన్ని వీన్ని ప్రశ్నించి బస్టాండులో వున్న అందర్ని భయస్తులం చేసి ఆఖరుకు నేలమీద పడుకున్న కిట్టిగాన్ని పట్టుకొని ''దొంగతనం చేసి నిద్రపోతున్నావా? నిద్ర యాక్షన్ చేస్తున్నావురా? నీవు'' లాఠీతో నాల్గుమోదాడు ఆకలి కడుపుతో నిద్రమత్తులో వున్న వానికి ఏమీ అర్థం కాలేదు.

''ఎక్కడ పెట్టావురా ఐదువేలు'' వాడి బట్టలు వూడదీసాడు. పర్సు ఎత్తుకుపోయి ఎక్కడో దాచాడు వీడు'' ''ఎక్కడ దాచావురా నీవు'' చేతితో నాల్గు వేసాడు.


కిట్టిగాడు మంటకు లబోదిబో అంటున్నాడు

జనం నిండారు.

''వీడు మొన్న పర్సుకొట్టేసాడు మొన్ననే నాల్గు తోమాను అయినా ఇవ్వాళ్ల దొంగతనం చేసాడు'' అన్నాడు పోలీసు''

ఇంతమాట అన్న తర్వాత జనం నమ్మరా? మూడు రోజుల క్రితం వాడు నిజామాబాద్‌లో వున్నది లేదు పోలీసు వాడ్ని దొంగను చేసాడు.

పన్నెండేళ్ళ కిట్టిగాడికి నోటమాట రావటం లేదు. చుట్టూ జనం. భయంతో వణికి పోయారు. మాట మాటకు ప్రశ్న ప్రశ్నకు చెయ్యి లేపేతున్న పోలీసు.



కిట్టిగాడికి నోటమాటరావటం లేదు.

మొన్న వీడు జేబు కత్తిరిస్తుండగా పట్టుకొని నాల్గు బాదానని పోలీసు చెప్పగా ఎవరు నమ్మరు?

జనం నమ్మారు.

జనంలో కొందరు వీరులుంటారు వీళ్ళు వీరులుకాదు దద్దమ్మలు తామే హీరోలమని భావిస్తారు ఎవరినైనా కొట్టటానికి అవకాశం దొరికితే బాగుండుననుకుంటారు. ఇటువంటి వాళ్ళే చేసుకొన్న భార్యను సకల సపర్యలు చేయించుకుంటూనే మాట మాటకు కొడుతుంటారు.

అవకాశం దొరికిందిగా!

చేతికి దొంగ దొరికాడుగా!

వాడు పన్నెండేళ్ళు దాటని పిల్లోడా? జాలి వద్దు దొంగమీద జాలేమిటీ?

అటువంటి హీరోలు కిట్టిగాన్ని చావబాదారు.

కొడుతున్న ప్రజలను ఆపి "వీడు దొంగలా కనిపించటం లేదు దొంగ నా కొడుకు" అంటూ దొంగ దొరికాడని పోలీసు అంటే సంతోషంతో బాధితుడు ఐదువేలు దొరుకుతాయని ఆశిస్తూ పోలీసు హంగామా చూస్తున్నాడు.

"అవును వీడు దొంగే!" అన్నారు చుట్టూ నిల్చున్న ప్రజలు.

ఈ వ్యవస్థలో పేదోడు దొంగ.

ఆకలి కడుపుతో వున్నాడు దొంగ.

నోరులేని పిల్లోడు దొంగ.

ఎదురు చెప్పలేడు కనుక కిట్టిగాడి దొంగ.

తెల్ల బట్టలోళ్ళు దొంగలు కారు.

కిట్టిగాడు దొంగయ్యాడు.

★ ★ ★

"వీడు ఇలా చెప్పడు మీరు పిటీషన్ వ్రాసి యివ్వండి లాకప్‌లో వేసి చావబాదుతాం. మీ పేరు వేలు కక్కిస్తానన్నాడు" పోలీసు.

కిట్టిగాడి కడుపులో ఆకలి మండుతుంది ఐదువేలు వుంటాయా కక్కటానికి.

ఆశ...పోలీసులపై ఆశ రక్షకభటులనే ఆశ... ఈ మధ్య మేమున్నామని నమ్మిస్తున్నారు పోలీసులు ఆశ

బాధితుడు వ్రాసి యిచ్చాడు.

తర్వాత అంతా మామూలే.

కిట్టిగాడు దొంగ అయి లాకప్ రూమ్‌లో కెళ్ళిపోయాడు.

★ ★ ★

ఎవరైనా వచ్చి విడిపించుకుంటారని ఐదు రోజులు చూచారు పోలీసులు.

పోలీసులకు కిట్టిగాడి మీద దయపుట్టికాదు. చట్టానికి దయ వుండదు కనుక పోలీసులకు దయవుండదు. అసలు పోలీసులకు దయ లేదు కనుక చట్టం దయ లేకుండా పోయిందేమో.

ఎవరైనా వస్తే విడిపించుకోవటానికి ఓ ఐదువేలు పిండుకోవచ్చని ఆశ.

ఇటువంటి సంఘటనలలో న్యాయవాదులు పోలీసులు కుమ్ముక్కవుతారు పంచుకుంటారు.

ఎవరూ రాలేదు తెలిస్తేగా రావటానికి తెలుసుకుంటారని ఆశ అటువంటి లింక్స్ వుంచుతారులే పోలీసులు మంచోళ్ళు కిట్టిగాడి విషయంలో ఆ లింక్స్ ఏమీ పనిచేయలేదు.

ఐదు రోజుల తర్వాత కిట్టిగాడిని దొంగ అంటూ కోర్టులో హాజరు పర్చారు.

గౌరవనీయులైన న్యాయమూర్తిగారు కిట్టిగాన్ని దొంగగా గుర్తించి జైలుకు పంపారు. బాలల కారాగారానికి బాలలకో కారాగారముంటుంది. భవిష్యత్ నేరస్థుల తయారు చేయటానికి!

ఇది కిట్టిగాడి కథే.

వాడిప్పుడు జైలులో వుంటున్నాడు.

★ ★ ★

కథ అయిపోయినట్టే ఇంకేముంది?

జైలులో వేసిన 15 రోజుల తర్వాత కిట్టిగాడి తండ్రి వెదుకుతూ వెదుకుతూ నిజామాబాద్ వచ్చాడు. జైలులో కొడుకును చూచాడు "దొంగతనం చేసావా?" తండ్రి అడగలేదు. కొడుకు చెప్పలేదు పారిపోయి వచ్చిన వాడు చేస్తే చేయవచ్చు అనుకున్నాడు. తాను దొంగగాదంటే పోలీసులు నమ్మలేదు. జనం నమ్మలేదు. ఆఖరుకు న్యాయమూర్తి నమ్మలేదు. తన దగ్గర డబ్బులు దొరకలేదు. నాన్నతో చెప్పి లాభమేమిటీ? అనుకున్నాడు.

కిట్టిగాడి తండ్రి నలుగురు న్యాయవాదుల నడిగాడు. కాళ్ళు మొక్కాడు. అందరూ ఒకే మాట అన్నారు "బెయిల్‌కు ఐదువేల పైన గావాలి"

కిట్టిగాడి పుస్తకాలకు డబ్బుల్లేని డబ్బులివ్వని తండ్రి ఐదువేలు ఎలా తేగలడు? వాడి ఖర్మ వాడి ప్రారబ్ధం అనుకొని రెండు కన్నీటి బొట్లు నేను లెక్కించలేదు రెండు వందలు కావచ్చు రెండు వేలు కావచ్చు రాల్చి వెళ్ళిపోయాడు.

వాడి కన్నీళ్ళు ఈ సమాజానికి శాపంగా మారవచ్చు. మంచివాడి కన్నీళ్ళు అవి.

★ ★ ★

కథ ముగించే ముందు–

పాఠకుల మనసులూ కిట్టిగాడ్ని దొంగను చేయటం నాకు యిష్టంలేదు వాడు దొంగే కాదు.

ప్రయాణీకుని జేబులోనుండి ఐదువేలున్న పర్సుపోయిన మాట నిజం ఎవరూ కొట్టివేయలేదు. కర్చీఫ్ తీస్తున్నప్పుడు బస్టాండులో క్రింద పడింది. ఎవరూ చూడలేదు. వెనుక నడుస్తున్న 'పోలీస్' చూచి యివ్వలేదు. జేబులో పెట్టుకున్నాడు. ఔట్‌పోస్టుకెళ్ళి చూచుకున్నాడు ఐదువేలు టేబుల్ డ్రాలో పారేసాడు.

ప్రయాణీకుడు పర్సుపోయింది గుర్తించి ఎవరో కొట్టేసారని అల్లరి చేసాడు. ఇది సహజం. అక్కడున్న పోలీసు దొంగను పట్టాలిగా నోరున్నవాడ్ని పడితే అల్లరిచేస్తాడు. కిట్టిగాడ్ని పట్టేసాడు.

కిట్టిగాడు అలా దొంగయ్యాడు.

★

